VC NEWS
# వేగుచుక్క
పీడిత ప్రజల గొంతుక...
TELUGU DAILY NEWS
www.veguchukkanews.com
నిజామాబాద్ సోమవారం 30 జూన్ 2025
వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:02 సంచిక: 336



2లో
క్షతగాత్రుల ఉచిత చికిత్సకు కసరత్తు

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD



# దేశంలో "మావోయిస్టులు" లేకుండా చేస్తాం.



**రేవంత్‌నుద్దేశించి అమిత్‌షా వ్యాఖ్య**

**కొందరు కాంగ్రెస్ వాళ్లు శాంతిచర్చలు అంటున్నారు**

**మావోయిస్టుల చేతిలో ప్రాణాలొదిలిన**

**ఆదివాసీ కుటుంబాలకు ఏం చెబుతారు?**

**2026 మార్చి నాటికి నక్సలిజాన్ని తుదముట్టిస్తాం**

**భారాస హయాంలో భారీ అవినీతి... అయినా కేసులేవి**

**నిజామాబాద్‌లో కేంద్ర హెూంమంత్రి**

**జాతీయ పసుపు బోర్డు కార్యాలయం ప్రారంభం**

లొంగిపోవాలని హెచ్చరించిన పట్టించుకోకనే ఆపరేషన్ కగార్.
గత కాంగ్రెస్ సర్కార్ పాకిస్థాన్ విషయంలో మెతక వైఖరి.
కేంద్ర హెూం శాఖ మంత్రి అమిత్ షా.

మోదీ పాలనలో దేశానికి రక్షణ గతంలో కాంగ్రెస్ పాలనలో పాకిస్థాన్ ఉగ్రవాదులు మన దేశంలో దాడులు చేసి పారిపోయేవారు. మోదీ హయాంలో ఆ పరిస్థితి లేదు. ఉరీలో సర్జికల్ స్ట్రైక్స్, పుల్వామాలో ఎయిర్ స్ట్రైక్స్, పహల్గాం ఘటన అనంతరం ఆపరేషన్ సిందూర్‌తో పాకిస్థాన్ ఉగ్రవాద స్థావరాలను ధ్వంసం చేశాం. భారతీయులను ప్రశాంతంగా ఉండనీయబోమంటున్న పాకిస్థానీయుల ముఖాలు చూస్తే ఎవరికి ప్రశాంతత లేదో అర్థమవుతుంది. ఈ విషయాన్ని గ్రహించని రాహుల్ గాంధీ.. గత పదేళ్లుగా దేశాన్ని రక్షిస్తున్న మోదీని పదే పదే ప్రశ్నలు అడుగుతున్నారు" అని అమిత్‌షా అన్నారు.

2లో..



## రేవంత్‌పై ఎందుకు విచారణకు ఆదేశించడం లేదు

హైదరాబాద్: దిల్లీలోని కాంగ్రెస్ పెద్దలకు తెలంగాణలోని రేవంత్ సర్కార్ ఏటీఎంగా మారిందని నిజామాబాద్ గడ్డపై తేల్చి చెప్పిన మీరు దీనిపై ఎందుకు విచారణకు ఆదేశించడం లేదని కేంద్ర హెూంశాఖ మంత్రి అమిత్‌షాను భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ప్రశ్నించారు. సీబీఐ, ఈడీతో కాంగ్రెస్ ప్రభుత్వం అవినీతి పై విచారణ జరిపించడానికి ఏం అడ్డు వస్తుందో తెలంగాణ ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం కేటీఆర్ ప్రకటన విడుదల చేశారు. 'దిల్లీలో కాంగ్రెస్‌తో కుస్తీ, రాష్ట్రంలో దోస్తీ అన్నట్లు భాజపా కుమ్మక్కు రాజకీయాలు చేస్తోంది. దీని వల్లే రేవంత్‌ను భాజపా వెనకేసుకొస్తోందనే ఆరోపణలకు అమిత్ షా వద్ద సమాధానం ఉందా? రాహుల్‌గాంధీ, రేవంత్‌రెడ్డి కలిసి ఆర్‌ఆర్ ట్యాక్స్ పేరిట దోచుకుంటున్నారని ఏకంగా ప్రధాని మోదీ రాష్ట్రానికి వచ్చిన సందర్భంలో అన్నారు. దర్యాప్తునకు మాత్రం ఆదేశించడం లేదు. ఈ ఏడాది కేంద్ర బడ్జెట్‌లో పసుపు బోర్డుకు నయా పైసా కేటాయిం చలేదు. పేరుకు పసుపు బోర్డు పెట్టి రిబ్బన్ కట్ చేస్తే ప్రయోజనమేంటి?' అని అమిత్‌షాను కేటీఆర్ ప్రశ్నించారు.



## 'నేనే భాజపా రాష్ట్ర అధ్యక్షుడినైతే'..

హైదరాబాద్: భాజపా రాష్ట్ర అధ్యక్షుడిగా తనను నియమించాలని కోరుతూ.. గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ విడుదల చేసిన ఓ వీడియో చర్చనీయాంశమవుతోంది. అందులో రాజాసింగ్ ఏమన్నారంటే.. 'నన్ను అధ్యక్షుడిగా చూడాలని చాలా మంది కార్యకర్తలు ఫోన్లు చేస్తున్నారు. అందుకే నాకో అవకాశం ఇవ్వాలని అధిష్ఠానాన్ని కోరుతున్నా. నన్ను నియమిస్తే.. పార్టీలో గోరక్షణ విభాగాన్ని ఏర్పాటు చేస్తా. గోరక్షణకు పాటుపడే కార్యకర్తలకు రక్షణగా నిలబడతా. భాజపా అవసరాన్ని గడపగడపకు చాటి చెబుతా. మనది హిందుత్వ, కాషాయ పార్టీ అని ప్రచారం చేస్తా. మన ప్రభుత్వం వస్తే యోగి ఆదిత్య నాథ్‌లా పనిచేస్తాం. ఎన్నికలకు ఆర్నెల్ల ముందే అభ్యర్థులను ప్రకటిస్తాం. అధ్యక్ష పదవి ఎవరికిచ్చినా అభ్యంతరం లేదు. వీఐపీలా ఉండే వారు కాకుండా.. హిందుత్వం కోసం పనిచేసే వ్యక్తినే నియమిస్తే బాగుంటుంది. రాజాసింగ్ అధ్యక్షుడు కావొద్దని అడ్డుకునే ఒక బృందం పనిచేస్తోంది' అంటూ ముగించారు.

## వైద్య విద్యార్థుల స్టైపెండ్ 15 శాతం పెంపు



హైదరాబాద్: రాష్ట్రంలో యూజీ, పీజీ వైద్య విద్య అభ్యసిస్తున్న విద్యార్థుల స్టైపెండ్‌ను ప్రభుత్వం 15 శాతం పెంచింది. వైద్య ఆరోగ్య శాఖ ఈ మేరకు జీవో విడుదల చేసింది. పెంచిన ఈ భత్యం ఈ ఏడాది జనవరి నుంచే అమల్లోకి వస్తుందని పేర్కొంది. ఈ పెంపుతో సీనియర్ రెసిడెంట్లు, సూపర్‌స్పెషాలిటీ కోర్సు చేసే వారికి ఇచ్చే గౌరవ వేతనం నెలకు రూ.లక్ష దాటింది. ఇతర రాష్ట్రాల్లో ఎక్కడా ఇంత మొత్తంలో భత్యం లేదని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. తమ భత్యాలు 15 శాతం పెంచాలని లేని పక్షంలో జూన్ 30 నుంచి నిరవధిక సమ్మెకు దిగుతామని జూనియర్ వైద్యులు ప్రకటిం చారు. కోరినట్టుగా ప్రభుత్వం భత్యం పెంచడంతో సమ్మె యోచనను విరమిస్తున్నట్టు జూడాలు ఒక ప్రకటనలో తెలిపారు. మంత్రి దామోదర్ రాజనర్సింహను జూడాల సంఘం మర్యాదపూర్వకంగా కలిసి ధన్యవాదాలు తెలిపింది.

## ఎమర్జెన్సీ పోరాట యోధుల్ని సదా స్మరించుకోవాలి

**123వ 'మన్‌కీ బాత్'లో ప్రధాని మోదీ**

**దేశంలో 95 కోట్ల మందికి సామాజిక రక్షణ**

దిల్లీ: దేశంలో ఎమర్జెన్సీ విధించినవారు రాజ్యాంగాన్ని హత్య చేసి, న్యాయవిభాగాన్ని కీలుబొమ్మగా మార్చుకోవాలని అనుకున్నారని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విమర్శించారు. నాటి నిర్బంధంపై పోరాడిన యోధులను కచ్చితంగా స్మరించుకోవాలని, అది రాజ్యాంగాన్ని కాపాడుకోడానికి మనల్ని ప్రేరేపిస్తుందన్నారు. దేశంలో ఎమర్జెన్సీ విధించి 50 ఏళ్లు పూర్తవడాన్ని ఆదివారం నాటి 123వ 'మన్‌కీ బాత్'లో ప్రధాని ప్రస్తావించారు. ఎమర్జెన్సీపై గళమెత్తిన మొరార్జీ దేశాయ్, వాజ్‌పేయి, బాబూ జగ్జీవన్‌రామ్‌ల ఆడియో ప్రసంగాలను కాసేపు వినిపించారు. భారత జనాభాలో దాదాపు 95 కోట్లమంది (64 శాతం) ఏదో ఒక సామాజిక రక్షణ పథకంతో లబ్ధి పొందుతున్నట్లు అంతర్జాతీయ కార్మికసంస్థ తెలిపిందని మోదీ చెప్పారు. 2015 నాటికి సామాజిక రక్షణ ఫలాలు కేవలం 25



కోట్లమందికి అందేవని గుర్తు చేశారు. ఇటీవల అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని యావత్ ప్రపంచం జరుపుకొందని, అందరి జీవితాల్లో యోగా భాగమవుతోందని హర్షం వ్యక్తం చేశారు. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో ఉన్న శుభాంశు శుక్లాకు అభినందనలు తెలిపిన ప్రధాని.. భారతదేశం కొత్త చరిత్రను లిఖించిందన్నారు.

**యోగా దినోత్సవం ఎంతోమందికి స్ఫూర్తినిస్తుంది**

ఈ ఏడాది అద్భుతంగా జరిగిన అంతర్జాతీయ యోగా దినోత్సవం.. యోగాను తమ జీవితంలో అంతర్భాగంగా మార్చుకొనేలా మరింత మందికి కచ్చితంగా స్ఫూర్తినిస్తుందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు. ఆదివారం ఆయన మన్ కీ బాత్ కార్యక్రమం ద్వారా చేసిన ప్రసంగంలో విశాఖపట్నంలో జరిగిన అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని మరోసారి గుర్తుచేసుకున్నారు. "ఈ సారి కూడా జూన్ 21న దేశంతోపాటు, ప్రపంచవ్యాప్తంగా కోట్ల మంది ప్రజలు అంతర్జాతీయ యోగా దినోత్సవంలో పాలుపంచుకున్నారు. విశాఖపట్నంలో సముద్రం ఒడ్డున 3 లక్షల మంది ప్రజలు ఒకేసారి యోగా చేశారు. విశాఖపట్నం నుంచే మరో అద్భుతమైన దృశ్యం మనముందు కనిపించింది. తెలంగాణలో 3వేల మంది దివ్యాంగులు ఒకేచోట యోగాలో భాగస్వాములు అయ్యారు. సశక్తీకరణకు యోగా ఎలా మాధ్యమంగా మారిందన్న విషయాన్ని వారు ఆచరణలో చూపించారు. యోగాను తమ జీవితంలో అంతర్భాగంగా మార్చుకొనేలా మరింతమందికి కచ్చితంగా స్ఫూర్తినిస్తుంది" అని ప్రధాని మోదీ పేర్కొన్నారు.

## రామచందర్‌రావు, ఈటలలో ఒకరికి అవకాశం!





హైదరాబాద్: భాజపా రాష్ట్ర అధ్యక్ష పదవికి తుది రేసులో ఇద్దరి పేర్లు బలంగా వినిపిస్తున్నాయి. మాజీ ఎమ్మెల్సీ రామచందర్‌రావు, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌లలో ఒకరికి అవకాశం దక్కే వీలుందని విశ్వసనీయ సమాచారం. కాబోయే నూతన అధ్యక్షుడికి సోమవారం ఉదయం జాతీయ నాయకత్వం నుంచి ఫోన్ ద్వారా సమాచారం అందనున్నట్లు తెలిసింది. రాష్ట్ర అధ్యక్ష పదవి కోసం నియమితులైన ఎన్నికల రిటర్నింగ్ అధికారిణి, కేంద్ర మంత్రి శోభా కరంద్లాజే ఆదివారం రాత్రి హైదరాబాద్ చేరుకున్నారు. జాతీయ ప్రధాన కార్యదర్శి సునీల్ బన్సల్ సోమవారం ఉదయం రానున్నారు. అధ్యక్ష ఎంపికలో కీలకమైన నామినేషన్ల ఘట్టం సోమవారం జరగనుంది. మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం 4 వరకు భాజపా రాష్ట్ర కార్యాలయంలో నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ఉంటుంది. నామినేషన్ వేసేది ఒకరేనని తెలిసింది.

**ఎవరి ధీమా వారిదే**

రాష్ట్ర అధ్యక్ష పదవికి మొదటి నుంచి నాలుగైదు పేర్లు వినిపించినా.. ఆదివారం పార్టీ వర్గాల్లో ఇద్దరి పేర్లపై ప్రధానంగా చర్చ జరిగింది. జాతీయ నాయకత్వం కొద్ది రోజుల క్రితమే తెలంగాణలోని ఆర్ఎస్ఎస్ ప్రతినిధులు, రాష్ట్ర ముఖ్య నేతల అభిప్రాయాలను తీసుకొన్నట్లు తెలిసింది. సంఘ్ నేతలు, పార్టీలో ఆది నుంచి ఉన్న సీనియర్ నేతలు పలువురు రామచందర్‌రావు పేరును ప్రతిపాదించినట్లు సమాచారం. మరోవైపు ఈటల పేరు చాలా కాలంగా పరిశీలనలో ఉంది. బీసీ వర్గానికి అధ్యక్ష పదవిలో పార్టీ ప్రాధాన్యం ఇస్తుందన్న చర్చ నేపథ్యంలో అధిష్ఠానం బాధ్యతలు తనకే అప్పగిస్తుందని ఈటల గట్టి ధీమాతోనే ఉన్నారు. వీరిలో ఎవరి పేరును నాయకత్వం ప్రకటిస్తుందన్నది ఆసక్తికరంగా మారింది. భాజపా రాష్ట్ర అధ్యక్షుడి పేరు ప్రకటించాక పార్టీ శ్రేణులు సంబరాలు ఘనంగా చేయాలని పార్టీ నిర్ణయించింది. ఎన్నిక నేపథ్యంలో రంగారెడ్డి జిల్లా మన్నెగూడలోని ఒక ఫంక్షన్ హాలులో ఆదివారం రాత్రి పార్టీ శ్రేణులు సన్నాహక సమావేశం నిర్వహించారు. రాష్ట్ర భాజపా ఇంఛార్జ్ అభయ్‌పాటిల్, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి (సంస్థాగత) చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడు జి.మనోహర్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, కాసం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. జులై 1న ఎల్బీనగర్‌లోని ఒక ఫంక్షన్ హాల్‌లో రాష్ట్ర అధ్యక్షుడి పేరును పార్టీ అధికారికంగా ప్రకటించనుందని పార్టీ వర్గాలు వెల్లడించాయి.



## జూరాల గేట్లకు మరమ్మతులూ చేయలేని కాంగ్రెస్

సభలో మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు. చిత్రంలో రజిని, శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మారెడ్డి, నిరంజన్‌రెడ్డి, ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్, నరేందర్‌రెడ్డి తదితరులు

ఆత్మకూరు: జూరాల జలాశయంలో పూడిక తొలగించలేని కాంగ్రెస్ ప్రభుత్వం గేట్లకు మరమ్మతులు కూడా పూర్తి చేయలేకపోయిందని మాజీ మంత్రులు హరీశ్‌రావు, నిరంజన్‌రెడ్డి విమర్శించారు. మాజీ సీఎం కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేస్తానంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రగల్భాలు పలుకుతున్నారని.. ఆయన ఆనవాళ్లు లేకుండా చేయడమంటే తెలంగాణ ఆనవాళ్లు లేకుండా చేయడమేనన్నారు. ఆదివారం వనపర్తి జిల్లా అమరచింతలో తెలంగాణ ఉద్యమ గాయకుడు దివంగత సాయిచంద్ విగ్రహావిష్కరణ సభలో వారు మాట్లాడారు. జై తెలంగాణ అనలేని వ్యక్తి రాష్ట్రాన్ని పాలిస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో 'నై తెలంగాణ' అంటున్న ప్రభుత్వం ఎక్కువ రోజులు మనుగడ సాధించలేదని చెప్పారు. మళ్లీ 'జై తెలంగాణ' అనే ప్రభుత్వమే రావాలని ప్రజలు కోరుతున్నారని తెలిపారు. ఏపీలో చంద్రబాబు పాలన తెలంగాణలో ఆయన శిష్యుడి పాలన సాగుతోందన్నారు. ఇప్పటికే కృష్ణా జలాలు ఆంధ్ర పాలకులు దోపిడీ చేయగా, గోదావరి జలాలను సైతం దోచుకునేందుకు కుట్ర పన్నుతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో మాజీ మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, జైపాల్‌యాదవ్, రాజేందర్‌రెడ్డి, ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, పట్నం నరేందర్‌రెడ్డి, గొంగిడి సునీత, భారాస రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, గిడ్డంగుల సంస్థ మాజీ ఛైర్‌పర్సన్ రజిని తదితరులు పాల్గొన్నారు.

# దేశంలో "మావోయిస్టులు" లేకుండా చేస్తాం.



వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, జూన్ 29:

దేశంలో 2026 మార్చి నాటికి "మావోయిస్టులు" లేకుండా చేస్తాం అని, మావోయిస్టులను లొంగిపోవాలని హెచ్చరించిన పట్టించుకోకపోవడంతోనే ఆపరేషన్ కగార్ చేపట్టామని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా అన్నారు. గత కాంగ్రెస్ సర్కార్ పాకిస్థాన్ విషయంలో మెతక వైఖరి అవలంబించిందనీ, మోడీ ప్రధానిగా పదేళ్ల కాలంలో పాకిస్థాన్ కు భారత్ తడాఖా ఏంటో చూపిందని ఆయన పేర్కొన్నారు. నిజామాబాద్ జిల్లా కేంద్రలో ఆదివారం పసుపు బోర్డు ప్రారంభించిన అనంతరం కంఠేశ్వర్ లో దిగంవత మాజీ మంత్రి డీఎస్ విగ్రాహావిష్కరణ చేశారు. అనంతరం పాలిటెక్నిక్ మైదానంలో జరిగిన కిసాన్ సమ్మేళనంలో అమిత్ షా ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. దేశంలో సీమాంతర ఉగ్రవాదానికి కారణమైన నక్సల్స్ ను ఏరివేసేందుకు ఆపరేషన్ కాగార్ చేయాలా వద్దా అని ప్రజలను ప్రశ్నించారు. ఇది వరకే మావోయిస్టులను లొంగిపోవాలని హెచ్చరించినా వినిపించుకోకుండా హింసకు పాల్పడుతున్నారని అన్నారు. అందువల్లే ఆపరేషన్ కగార్ చేపట్టామని అన్నారు. ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటామన్నారు.

**పాకిస్థాన్ తో యుద్ధం విషయంలో రాహుల్ బాబా ఇప్పటికీ ఏవో ప్రశ్నలు వేస్తుంటాడని, అవి పట్టించుకోమని అన్నారు.**

తెలంగాణలో ఆనాటి బీఆర్ఎస్ సర్కార్ ఎలాంటి అవినీతికి పాల్పడిందో ప్రజలకు తెలుసని కేంద్ర హెూం మంత్రి అమిత్ షా అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు, టీఎస్ పీఎస్సీ వంటి వాటితో బీఆర్ఎస్ ప్రజల సొమ్మును లూటీ చేసిందన్నారు. కాళేశ్వరం బీఆర్ఎస్ కు ఏటీఎం అయితే ప్రస్తుతం ఇక్కడి కాంగ్రెస్ ప్రభుత్వం ఢిల్లీకి ఏటిఎంలా తయారైందని విమర్శించారు. తెలంగాణా జనం బీఆర్ఎస్ జెండాను పీకిపారేశారని అన్నారు. ఇక్కడ కాంగ్రెస్ కు కూడా నూకలు చెల్లే రోజు వస్తుందని గుర్తు చేశారు. తెలంగాణలో బీజేపీ ప్రభుత్వ ఏర్పాటుకు ఇక్కడి ప్రజలు, యువత, కార్యకర్తలు సంకల్పం తీసుకోవాలని అన్నారు.

**రైతుల పోరాటాన్ని గుర్తించి పసుపు బోర్డు ఏర్పాటు.**

జిల్లా రైతుల పోరాటం, ఎంపీ అరవింద్ రైతులకు ఇచ్చిన హామీ మేరకు మోడీ సర్కార్ పసుపు బోర్డు ఏర్పాటు చేసిందనీ అమిత్ షా అన్నారు. పసుపు బోర్డు ఏర్పాటుతో పసుపు రైతులకు మోడీ ఇచ్చిన హామీ నెరవేరిందన్నారు. అనాదిగా నిజామాబాద్ రైతులు పసుపు సాగు చేస్తున్నా మార్కెట్ లో అనుకున్న గుర్తింపు దక్కలేదన్నారు. పసుపు బోర్డు ఏర్పాటుతో ఇందూరు పసుపునకు ప్రపంచవ్యాప్త గుర్తింపు పొందనుందన్నారు. నిజామాబాద్ జిల్లో పసుపు రీసెర్చ్ సెంటర్లను ఏర్పాటు చేస్తామని, భారత్ కో ఆపరేటివ్ బ్రాంచ్ ను, భారత్ కో ఆపరేటివ్ ఎక్స్ పోర్ట్ బ్రాంచీలను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. పసుపు యాంటీ బయోటిక్, పసుపు మన దైనందిన జీవితంలో భాగమని దానికి గ్లోబల్ ఐడెంటిటీ కోసం పాటు పడుతున్నామన్నారు. 2025లో పసుపు ధర క్వింటాలుకు రూ.19వేలు పలికిందని, రానున్న మూడేళ్లలో రూ.7వేలు అధికం కానుందన్నారు. రాబోయే రోజుల్లో పసుపు పంటకు నిజామాబాద్ క్యాపిటల్ సిటీ కాబోతుందని అన్నారు.

# పసుపు రైతులు నవ్వుకుంటున్నారు: ప్రశాంత్‌రెడ్డి

హైదరాబాద్:, హైదరాబాద్: గతంలోనే ప్రారంభించిన పసుపు బోర్డును తాత్కాలిక కార్యాలయం నుంచి మరో భవనంలోకి మార్చి కేంద్ర హెూంమంత్రి అమిత్‌షా మళ్లీ ప్రారంభించడంపై పసుపు రైతులు నవ్వుకుంటున్నారని మాజీ మంత్రి, భారాస ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి పేర్కొన్నారు. పసుపు రైతులకు కావాల్సింది కార్యాలయాలను తరచూ ప్రారంభించడం కాదని, మద్దతు ధరను అందించాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 'అమిత్‌షా ప్రసంగంలో రాజకీయ అంశాలు మాత్రమే ఉన్నాయి. పసుపు మద్దతు ధర, బోర్డుకు నిధులు, శాశ్వత భవనం ప్రస్తావనే లేదు. నిధులు లేకుండా ఈ బోర్డుతో రైతులకు ఏం లాభం' అని ప్రశాంత్‌రెడ్డి ప్రశ్నించారు.

## 4న ఎల్బీ స్టేడియంలో కాంగ్రెస్ సభ

హైదరాబాద్: జై బాపు, జై భీం, జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా రాష్ట్రంలోని అన్ని గ్రామాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుల సమ్మేళనం పేరుతో జులై 4న హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో సభ నిర్వహించనున్నట్లు పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ వెల్లడించారు. దీనికి పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే హాజరవుతారని ఆయన ప్రకటించారు. ఆదివారం గాంధీభవన్‌లో హైదరాబాద్ కాంగ్రెస్ నేతలతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో, అనంతరం మీడియాతో ఆయన మాట్లాడుతూ.. "రాజ్యాంగ పరిరక్షణ కోసం దేశవ్యాప్తంగా కాంగ్రెస్ చేపట్టిన జై సంవిధాన్ కార్యక్రమం తెలంగాణలో విజయవంతంగా సాగుతోంది. గాంధీభవన్‌లో జులై 4న పీసీసీ రాజకీయ వ్యవహారాల కమిటీ(పీఏసీ), అనంతరం పీసీసీ విస్తృత స్థాయి సమావేశాలు జరుగుతాయి. అదేరోజు సాయంత్రం ఎల్బీస్టేడియంలో 15,000 మంది గ్రామస్థాయి నేతలతో బహిరంగ సభ ఉంటుంది. దివంగత కాంగ్రెస్ నేత డి.శ్రీనివాస్(డీఎస్) భాజపాలో ఏనాడూ లేరు. అలాంటి నేత విగ్రహాన్ని భాజపా నాయకుడు అమిత్‌షాతో నిజామాబాద్‌లో ఆవిష్కరింపజేశారు. డీఎస్ ఆత్మ క్షోభిస్తుంది. విగ్రహ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వమే స్థలం కేటాయించినా కాంగ్రెస్ నాయకులెవరికీ ఆహ్వానం రాలేదు. జూబ్లీహిల్స్‌లో ఉపఎన్నిక ఎప్పుడు జరిగినా కాంగ్రెస్ గెలుస్తుంది. మాజీ మంత్రి ముకేశ్‌గౌడ్ విగ్రహం హైదరాబాద్‌లో ఏర్పాటు చేస్తాం" అని చెప్పారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ కుమారుల చర్యల కారణంగా డీఎస్ ఆత్మ క్షోభిస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం నెల రోజుల్లోపు పడిపోతుందని భారాస నేతలు శాపనార్థాలు పెడుతూ ప్రభుత్వాన్ని అస్థిరపరిచే కుట్రలు చేశారని ఆరోపించారు. భారాస ఇప్పుడు ప్రభుత్వ ఉద్యోగులను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తోందన్నారు. అంతకుముందు డీఎస్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి ముఖ్యనేతలంతా నివాళులర్పించారు.

# కొత్త పన్ను విధానంలోనూ టాక్స్ తగ్గింపులు



పన్ను చెల్లింపుదారులు ఐటీ రిటర్న్ దాఖలు చేసే ముందు అన్ని విషయాలు తెలుసుకోవాలి. ఈ ఆర్థిక సంవత్సరం ముగిసిన తర్వాత ఐటీఆర్ ఫైల్ చేయాల్సి ఉంటుంది. అందుకోసం పన్ను తగ్గింపులు, మినహాయింపులు పొందొచ్చు. పాత పన్ను విధానంలో పన్ను తగ్గించుకునేందుకు ఎక్కువ వెసులుబాటు ఉండగా.. కొత్త పన్ను విధానంలో కూడా కొన్ని మినహాయింపులు పొందొచ్చు. అవేంటో తెలుసుకుందాం.

టాక్స్‌పేయర్లకు ప్రస్తుతం రెండు పన్ను విధానాలు అందుబాటులో ఉన్నాయి. పాత పన్ను విధానంలో మాత్రం పెద్దగా మార్పులు చేయట్లేదు. గత రెండు సార్లు బడ్జెట్ సందర్భంగా.. కొత్త పన్ను విధానంలోనే కీలక మార్పులు చేసింది. కేంద్ర బడ్జెట్ - 2023 సమయంలోనే డిఫాల్ట్‌గా కొత్త పన్ను విధానం ఉంటుందని కేంద్రం స్పష్టం చేసింది. కావాలనుకుంటే.. పాత పన్ను విధానంలోకి కూడా మారేందుకు వెసులుబాటు ఉంటుంది. అయితే.. ఐటీ రిటర్న్ డెడ్‌లైన్ ముగిసిన తర్వాత.. బిలేటెడ్ రిటర్న్ సమయంలో మాత్రం కొత్త పన్ను విధానంలో ఐటీ రిటర్న్ దాఖలు చేయాల్సి ఉంటుంది. కొత్త పన్ను విధానంలో ప్రాథమిక పన్ను మినహాయింపు పరిమితి సహా ఇతర రాయితీల్ని పెంచడంతో పన్ను చెల్లింపుదారులకు మరింత ఆకర్షణీయంగా దీనిని మార్చింది. పాత పన్ను విధానంలోనే ఎక్కువగా టాక్స్ బెనిఫిట్స్ ఉండగా.. కొత్త పన్ను విధానంలోనూ కొన్ని మినహాయింపుల్ని క్లెయిమ్ చేసుకునేందుకు వీలుంది. అవేంటో ఇప్పుడు మనం చూద్దాం. అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభుత్వ పథకాలైనటువంటి పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్, ఈఎల్ఎస్ఎస్, కిసాన్ వికాస్ పత్ర, నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్ వంటి వాటిల్లో పన్ను తగ్గించుకునేందుకు కొత్త పన్ను విధానంలో ఛాన్స్ లేదు. అయితే ఇక్కడ బెనిఫిట్స్ మాత్రం పొందొచ్చు.

స్టాండర్డ్ డిడక్షన్ జీతం ద్వారా ఆదాయం అందుకుంటున్న ఉద్యోగులు, పెన్షనర్లు.. కొత్త పన్ను విధానంలో రూ. 75 వేల వరకు ప్రామాణిక తగ్గింపు పొందొచ్చు. నేరుగా ఈ మినహాయింపును క్లెయిమ్ చేసుకోవచ్చు. ఈ ప్రామాణిక తగ్గింపును ఆటోమేటిక్‌గా పరిగణనలోకి తీసుకుంటాయి. దీని కోసం ప్రత్యేకంగా దరఖాస్తు చేసుకోవాల్సిన పని లేదు. ఉద్యోగులు.. నేషనల్ పెన్షన్ స్కీమ్ అకౌంట్‌కు.. సంస్థ యజమాని అందించే సహకారంపై కొత్త పన్ను విధానంలో మినహాయింపు పొందొచ్చు. ఈ మినహాయింపు సెక్షన్ 80 (2) కిందికి వస్తుంది. ప్రైవేట్ రంగ ఉద్యోగులు.. అతను లేదా ఆమె జీతంలో (బేసిక్ పే ప్లస్ డీఏ) గరిష్టంగా 10 శాతానికి సమానమైన మొత్తం క్లెయిమ్ చేసుకోవచ్చు. సాధారణంగా కాంట్రిబ్యూషన్లపై సెక్షన్ 80 కింద రూ. 1.50 లక్షలు, సెక్షన్ 80 (1) కింద రూ. 50 వేల వరకు మినహాయింపు లభిస్తుంది. ఇది కొత్త పన్ను విధానానికి అందుబాటులో లేవు.

అగ్నివీర్ అగ్నిపథ్ స్కీమ్ 2022 కింద నమోదు చేసుకున్న వ్యక్తులు.. అగ్నివీర్ కార్పస్ ఫండ్‌లో జమ చేసిన మొత్తంపై సెక్షన్ 10 కింద పన్ను మినహాయింపు ఉంటుంది. ఇందుకోసం సెక్షన్ 80 ప్రతిపాదించారు. ఆదాయపు పన్ను శాఖ ప్రకారం.. అగ్నివీర్ కార్పస్ ఫండ్‌కు చేసిన విరాళాలకు సమానంగా తగ్గింపు పొందొచ్చు. ఇది పాత, కొత్త పన్ను విధానాల్లో అందుబాటులో ఉంటుంది. వ్యాపార సంస్థలు.. బోర్డులోకి కొత్త ఉద్యోగుల్ని తీసుకున్నప్పుడు.. పన్ను తగ్గింపులకు ఆదాయపు పన్ను చట్టం సెక్షన్ అనుమతిస్తుంది.

సీనియర్ సిటిజెన్స్- పాత పన్ను విధానంలో సీనియర్ సిటిజెన్స్‌కు కనీస ఆదాయ మినహాయింపు పరిమితి రూ. 3 లక్షలు కాగా.. సూపర్ సీనియర్ సిటిజెన్స్‌కు రూ. 5 లక్షలు పరిమితిగా ఉంది. ఇక కొత్త పన్ను విధానంలో ఇది రూ. 7 లక్షలుగా ఉంది.

# క్షతగాత్రుల ఉచిత చికిత్సకు కసరత్తు




హైదరాబాద్: రోడ్డుప్రమాదంలో గాయపడినవారికి ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స చేయించాలంటే బీమా సదుపాయమైనా ఉండాలి లేదా నగదైనా చెల్లించాలి. అలా కాకుండా ఉచితంగా వైద్యచికిత్స పొందడం ఇప్పటివరకూ అసాధ్యమే. సమీప భవిష్యత్తులో ఇది సుసాధ్యం కాబోతోంది. రోడ్డుప్రమాద క్షతగాత్రులకు రూ.లక్షన్నర వరకు నగదురహిత వైద్య సదుపాయం అందించే విధానాన్ని కేంద్ర ప్రభుత్వం అందుబాటులోకి తీసుకురాబోతోంది. మోటారు వాహనాల చట్టం-1998లోని 162 సెక్షన్ ప్రకారం నగదురహిత చికిత్స అందించే పథకాన్ని ఇప్పటికే పంజాబ్, హరియాణా, ఉత్తరాఖండ్ తదితర ఏడు రాష్ట్రాల్లో ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నారు. తెలంగాణలోనూ అమలుకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. త్వరలో సైబరాబాద్, మెదక్ పోలీస్ యూనిట్ల పరిధిలో ప్రయోగాత్మకంగా అమలు చేసే యోచనతో ఉన్నారు. ప్రమాదం జరిగిన ప్రాంతానికి సమీపంలోని ఏ ప్రైవేటు ఆసుపత్రిలోనైనా ఈ సేవల్ని పొందొచ్చు. ఎలాంటి వైద్యబీమా లేకున్నా ప్రమాదం జరిగిన తర్వాత ఏడు రోజుల దాకా ఈ సదుపాయాన్ని వినియోగించుకునే అవకాశం ఉంటుంది. అయితే, ప్రమాదం జరిగిన 24 గంటల్లోపే ఆసుపత్రిలో చేర్చాల్సి ఉంటుంది. ఆయుష్మాన్ భారత్ ఎంప్యానల్‌లో లేకున్నా..

రాష్ట్రంలో ఏటా 20 వేలకుపైగా రోడ్డు ప్రమాదాల్లో 6 వేల మందికిపైగా మరణిస్తున్నారు. గతేడాది 23,491 ప్రమాదాల్లో 6,640 మంది మరణించారు. వీరిలో చాలామంది 24 గంటల్లోపు చికిత్స అందక ప్రాణాలొదిలారు. ఇలాంటి పరిస్థితుల్లో బీమా సదుపాయంతో సంబంధం లేకుండా ప్రైవేటు ఆసుపత్రుల్లోనూ నగదు రహిత చికిత్స అందించగలిగితే చాలావరకు ప్రాణాలు దక్కే అవకాశం ఉంది. కొత్తగా అమల్లోకి రాబోతున్న పథకం ఇందుకు ఊతమివ్వనుంది. ఆయుష్మాన్ భారత్‌లో ఎంప్యానల్ అయి ఉన్న ఆసుపత్రుల్లో ఉచితంగానే చికిత్స అందించనున్నారు. ఎంప్యానల్‌లో లేని ఆసుపత్రుల్లోనూ చికిత్సకు నిరాకరించడానికి వీల్లేదు. ప్రాథమిక చికిత్స అందించి, క్షతగాత్రుడు కోలుకున్న తర్వాత అవసరమైతే ఎంప్యానల్‌లోని ఆసుపత్రులకు తరలించాలి. ఎంప్యానల్‌లో లేని ఆసుపత్రుల్లో చికిత్సకు అయ్యే వ్యయాన్ని కేంద్ర ప్రభుత్వమే భరించనుంది.

ప్రతి బాధితుడికీ 'ఐడీ'

రోడ్డుప్రమాద క్షతగాత్రుల గురించి 108 లేదా 112 హెల్ప్‌లైన్ నంబర్‌కు ఎవరైనా సమాచారం ఇవ్వొచ్చు. వారిని సమీపంలోని ఆసుపత్రికి చేర్చిన తర్వాత స్థానిక పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేస్తారు. దాన్ని వెంటనే క్రైమ్ అండ్ క్రిమినల్ ట్రాకింగ్ నెట్‌వర్క్ సిస్టమ్(సీసీటీఎన్ఎస్)కు ఆన్‌లైన్‌లో పంపుతారు. ఆ వివరాలు ఎలక్ట్రానిక్ డిటెయిల్డ్ యాక్సిడెంట్ రిపోర్ట్(ఈ-డార్)కు చేరతాయి. దేశవ్యాప్తంగా నెట్‌వర్క్ కలిగిన ఈ-డార్‌లో ప్రతి క్షతగాత్రుడికి 'విక్టిమ్ ఐడీ' రూపొందుతుంది. ఆ వివరాలను వైద్యశాఖ డేటాబేస్‌కు పంపుతారు. అక్కడి నుంచి ఆసుపత్రికి చేర్చుతారు. ఆసుపత్రిలో 'పేషెంట్ ఐడీ' రూపొందిస్తారు. నగదు రహిత వైద్యచికిత్స వివరాలను ఈ-డార్ పోర్టల్‌లో నమోదు చేస్తారు. వైద్యచికిత్స వ్యయాన్ని 'కేంద్ర రహదారి రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వశాఖ(మోర్త్)' అధీనంలోని 'మోటార్ వెహికిల్ యాక్సిడెంట్ ఫండ్' నుంచి క్లెయిమ్ చేస్తారు. క్లెయిమ్‌ల వివరాలను ఆసుపత్రుల నిర్వాహకులు స్టేట్‌హెల్త్ ఏజెన్సీ(ఎస్‌హెచ్‌ఏ)కి అందించాలి.

## ఎప్పుడెప్పుడు విత్ డ్రా చేయొచ్చు?



సంఘటిత రంగంలో పనిచేసే ఉద్యోగులకు పీఎఫ్ అకౌంట్ ఉంటుందన్న సంగతి తెలిసిందే. ఈపీఎఫ్ ఫండ్స్ అనేది రిటైర్మెంట్ బెనిఫిట్స్ కోసం ఉద్దేశించిందే అయినప్పటికీ.. మధ్యలో కొన్ని అవసరాలకు కొంత మొత్తంలో డబ్బు విత్‌డ్రా చేసుకునేందుకు అవకాశం ఉంటుంది. విద్య, వైద్యం, వివాహం, ఇల్లు నిర్మాణం వంటి సందర్భాల్లో పాక్షికంగా క్యాష్ విత్‌డ్రా చేసుకోవచ్చు. ఎప్పుడెప్పుడు.. ఎంత తీసుకోవచ్చునేది ఇప్పుడు చూద్దాం.

ఎప్పుడెప్పుడు డబ్బులు తీసుకోవచ్చు.. ఎంతొస్తాయి. ఇలా క్లారిటీ ఉందా.? పీఎఫ్ గురించి అన్ని వివరాలు తెలుసుకోవాలి. అన్నింటిపై అవగాహన పెంచుకోవాలి. సంఘటిత రంగంలో పనిచేస్తున్న ఉద్యోగులకు పీఎఫ్ ఖాతా ఉంటుంది. దీనిని ఈపీఎఫ్ఓ నిర్వహిస్తుంటుంది. కంపెనీ ప్రతి నెలా మీ జీతంలో నుంచి 12 శాతం పీఎఫ్ అకౌంట్లో వేస్తుంది. కంపెనీ కూడా ఇంతే మొత్తం యాడ్ చేయాలి. ఇందులో పీఎఫ్ అకౌంట్లోకి 3 శాతానికిపైగా వెళ్తుంది. మరో 8 శాతానికిపైగా ఈపీఎస్ అకౌంట్లో యాడ్ అవుతుంది. ఇక ప్రతి ఆర్థిక సంవత్సరం చివర్లో.. పీఎఫ్ నిధులపై కేంద్రం వడ్డీ అందిస్తుంది. ప్రస్తుతం 8.25 శాతం వడ్డీ వస్తుంది. ఈపీఎఫ్‌లో జమవుతున్న నగదు మొత్తం.. రిటైర్మెంట్ కోసం ఉద్దేశించిందే అయినప్పటికీ చందాదారులు కొన్ని సందర్భాల్లో పూర్తిగా లేదా పాక్షికంగా నగదు విత్‌డ్రా చేసుకునే అవకాశం కల్పిస్తోంది. వైద్య చికిత్సలు, ఇంటి రెనోవేషన్, వివాహం, చదువులు వంటి సందర్భాల్లో ఈ నిధుల నుంచి డబ్బులు తీసుకోవచ్చు. దీని గురించి చూద్దాం. ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్ ద్వారా పీఎఫ్ విత్‌డ్రా చేసుకోవచ్చు.

ఆన్‌లైన్ విత్‌డ్రా కోసం మీ దగ్గర యూఏఎన్ నంబర్, పాస్‌వర్డ్ ఉండాలి. ఇది యాక్టివేషన్లో ఉండాలి. కేవైసీ పూర్తి చేసి ఉండాలి. ఇ- నామినేషన్ ఫైల్ చేసి ఉండాలి. మొబైల్ నంబర్ కూడా అప్డేట్‌లో ఉండాలి. ఆధార్ సీడింగ్ పూర్తి చేసి ఉండాలి. ఇవన్నీ కచ్చితంగా ఉంటేనే.. విత్‌డ్రా కుదురుతుంది. ఆఫ్‌లైన్‌లో అయితే నేరుగా ఈపీఎఫ్ఓ కార్యాలయానికి వెళ్లి ఫారం నింపి.. రిలేటెడ్ డాక్యుమెంట్స్ సమర్పించి సబ్మిట్ చేయాల్సి ఉంటుంది.

ఉద్యోగం నుంచి రిటైర్ అయినప్పుడు.. రెండు నెలలు లేదా అంతకంటే ఎక్కువ కాలం నిరుద్యోగిగా ఉన్నప్పుడు పూర్తి మొత్తం విత్‌డ్రా చేసుకోవచ్చు. రిటైర్మెంట్ కంటే ముందే ఉద్యోగి మరణిస్తే.. కుటుంబసభ్యులు పీఎఫ్ విత్‌డ్రా చేసుకోవచ్చు.

## మళ్లీ షాకిస్తున్న బంగారం ధరలు..

భారతీయులకు బంగారం అంటే ఎంత ఇష్టమో ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. ముఖ్యంగా భారతీయ మహిళలు.. పెళ్లిళ్లు, పండగలు, ఇతర వేడుకల సమయాల్లో బంగారు ఆభరణాలు కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపిస్తుంటారు. ఈ క్రమంలో డిమాండ్ కూడా ఉంటుంది. అయితే బంగారం ధరలే తరచుగా మారుతుంటాయి. ఇది అంతర్జాతీయ విపణికి అనుగుణంగా ట్రేడవుతుంటుందని చెప్పొచ్చు. అక్కడ పెరిగితే ఇక్కడా పెరుగుతుంది. అక్కడ తగ్గితే ఇక్కడా తగ్గుతుంది. అంతర్జాతీయ మార్కెట్లో, అదే విధంగా బంగారం, వెండి రేట్లు ఇప్పుడు తీవ్ర హెచ్చుతగ్గులకు లోనవుతున్నాయి. ఇటీవల యూఎస్ ఫెడరల్ రిజర్వ్ వరుసగా మూడో సారి వడ్డీ రేట్లను తగ్గించినప్పటి నుంచి.. గోల్డ్ రేట్లు అంతలా తగ్గట్లేదు. ఈ క్రమంలోనే ఇప్పుడు వరుసగా 3 రోజుల్లో స్వల్పంగా పెరుగుకుంటూ వచ్చాయి. ప్రస్తుతం హైదరాబాద్ నగరంలో చూస్తే పసిడి ధర ఒక్కరోజు రూ. 250 పెరిగి 22 క్యారెట్లపై తులం రూ. 97,500 వద్ద కొనసాగుతోంది. అంతకుముందు కూడా వరుసగా రెండు రోజుల్లో రూ. 250, రూ. 100 చొప్పున పెరిగింది. ఇక 24 క్యారెట్ల బంగారం ధర విషయానికి వస్తే.. రూ. 270 పెరగడంతో ప్రస్తుతం 10 గ్రాములకు రూ.97 వేలు పలుకుతోంది. ఇక్కడ దీనికి ముందు రెండు రోజులు రూ. 280, రూ. 100 చొప్పున పెరిగాయి. ఇదే సమయంలో దేశ రాజధాని ఢిల్లీ నగరంలో కూడా గోల్డ్ రేట్లు పెరిగాయి. ఒక్కరోజే రూ. 250 పెరగడంతో ప్రస్తుతం 22 క్యారెట్ల పసిడి ధర తులం రూ. 97,650 కి చేరింది. 24 క్యారెట్ల పుత్తడి ధర 10 గ్రాములు రూ. 97,150 వద్ద ఉంది.

# డ్రెస్ కోడ్ లేదని ఊడిన యువతి జాబ్..

**ఆమెకు రూ.32 లక్షలు చెల్లించాలని కంపెనీకి ఆదేశాలు**

డ్రెస్ కోడ్ పాటించకపోవడం ఆ యువతి ఉద్యోగానికే ఎసరు తెచ్చింది. స్పోర్ట్ షూ వేసుకెళ్లినందుకు గాను ఆ యువతిని ఆ కంపెనీ ఉద్యోగం నుంచి తొలగించింది. అయితే అందరిలా ఆ యువతి ఆ ఉద్యోగం వదిలేసి.. మరో జాబ్ చూసుకోలేదు. తనను ఉద్యోగం నుంచి అన్యాయంగా తొలగించారని.. న్యాయపోరాటం చేసింది. చివరికి అందులో విజయం సాధించడంతో.. ఆ కంపెనీకి షాక్ తగిలింది. ఆ యువతికి పరిహారం కింద రూ.32 లక్షలు చెల్లించాలని ఉద్యోగ ట్రిబ్యునల్ ఆదేశాలు జారీ చేసింది.

ప్రైవేటు ఉద్యోగాలు అంటే ఎప్పుడు ఉంటాయో ఎప్పుడు పోతాయో తెలియదు. మనకు నచ్చకపోయినా, కంపెనీకి నచ్చకపోయినా.. ఉద్యోగం పోయేది మనదే. ఇది అందరు ప్రైవేటు ఉద్యోగులకు తెలిసిందే. అయితే కొన్ని కంపెనీల్లో ఉండే రూల్స్ అండ్ కండీషన్స్ చాలా కఠినంగా ఉంటాయి. వాటిని తప్పనిసరిగా పాటించాల్సి ఉంటుంది. అలా కాదని ఎవరైనా గీత దాటితే మాత్రం వేటు తప్పదు. ఇక ఒక యువతికి మాత్రం ఊహించని అనుభవం ఎదురైంది. ఉద్యోగంలో చేరిన కొత్తలోనే ఆ యువతి నిబంధనలు పాటించడం లేదంటూ సదరు కంపెనీ ఆమె ఉద్యోగాన్ని ఊడగొట్టింది. దీంతో షాక్ అయిన ఆ యువతి.. ఉద్యోగ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించగా.. ఆమెకు అక్కడ న్యాయం దొరికింది. ఆమెను ఉద్యోగం నుంచి అకారణంగా తీసేశారని గుర్తించిన ఉద్యోగ ట్రిబ్యునల్ ఆ యువతికి పరిహారం అందించాలని కంపెనీని ఆదేశించింది.

లండన్‌లో జరిగిన ఈ సంఘటన ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఆఫీస్‌లో డ్రెస్ కోడ్ పాటించలేదని ఓ మహిళను ఉద్యోగం నుంచి తొలగించిన ఘటనలో ఓ కంపెనీకే పెద్ద ఎదురుదెబ్బ తగిలింది. ఉద్యోగం నుంచి ఆమెను అవసరంగా తొలగించాలని గుర్తించిన ఉద్యోగ ట్రిబ్యునల్.. ఆమెకు పరిహారంగా 30 వేల పౌండ్లు అంటే మన భారత కరెన్సీలో ఏకంగా రూ.32.20 లక్షలు చెల్లించాలని ఆదేశించింది. ఎలిజబెత్ బెనాస్సీ అనే 18 ఏళ్ల యువతి 2022లో లండన్‌లోని మ్యాక్సిమస్ యూకే సర్వీసెస్‌లో ఒక ఉద్యోగానికి ఎంపికైంది.

అయితే ఆమె ఉద్యోగంలో చేరిన కొన్ని రోజులకే ఆమె డ్రెస్ కోడ్ పాటించకుండా.. ఆఫీస్‌కు స్పోర్ట్స్ షూ వేసుకు వచ్చిందని గుర్తించిన యాజమాన్యం.. ఆమెను ఉద్యోగం నుంచి తొలగించింది. దీంతో ఆమె ఉద్యోగ ట్రిబ్యునల్‌కు వెళ్లి తన గోడును వెళ్లబోసుకుంది. అయితే ఆ కంపెనీకి డ్రెస్ కోడ్ ఉందని తనకు సమాచారం తెలియదని సదరు యువతి పేర్కొంది. అంతేకాకుండా తెలియకుండా తాను స్పోర్ట్స్ షూ వేసుకుని ఆఫీస్‌కు వెళ్లినందుకు అందులోని ఓ మేనేజర్ తనను తీవ్రంగా అవమానించారని తెలిపింది.

అయితే ఎలిజబెత్ బెనాస్సీ చేసిన ఆరోపణలను సదరు కంపెనీ తీవ్రంగా వ్యతిరేకించింది. తాము నిబంధనలను అతిక్రమించి ఎలాంటి తప్పు చేయలేదని ఆ కంపెనీ పేర్కొంది. ఇరువైపులా వాదనలు విన్న ఉద్యోగ ట్రైబ్యునల్ ఎలిజబెత్ బెనాస్సీకే మద్దతుగా తీర్పును వెలువరించింది.

ఈ క్రమంలోనే అకారణంగా ఉద్యోగం తొలగించినందుకు.. ఆమెకు రూ.32 లక్షలు పరిహారం ఇవ్వాలని తెలిపింది. అయితే ఆ యువతి ఉద్యోగానికి కొత్త అని.. డ్రెస్ కోడ్ గురించి ఆమెకు పూర్తిగా తెలియకపోవచ్చని పేర్కొంది. అది పొరపాటుగా భావించి.

# ఇచ్చిన హామీ మేరకు "పసుపు బోర్డు" ఏర్పాటు.

కార్యాలయ ప్రారంభోత్సవ సమావేశంలో కేంద్ర హెూం శాఖ మంత్రి అమిత్ షా.
అంతర్జాతీయ స్థాయిలో పసుపు పంట ఎగుమతులు జరిగేలా కృషి చేస్తామని వెల్లడి.
పాల్గొన్న కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్.
హాజరైన రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, సీతక్క.




**వేగుచుక్క న్యూస్,నిజామాబాద్ జూన్ 29 :**

తెలంగాణ ప్రాంత పసుపు రైతులకు చేసిన వాగ్దానం మేరకు ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం జాతీయ పసుపు బోర్డును ఏర్పాటు చేసిందని కేంద్ర హెూం శాఖ మంత్రి అమిత్ షా అన్నారు. అధిక విస్తీర్ణంలో పసుపు పండించే నిజామాబాద్ జిల్లాలో బోర్డును ఏర్పాటు చేయడంతో పాటు, ఇదే జిల్లాకు చెందిన రైతు బిడ్డ పల్లె గంగారెడ్డిని బోర్డు చైర్మన్ గా నియమించామని గుర్తు చేశారు. నిజామాబాద్ లో నూతనంగా నెలకొల్పిన జాతీయ పసుపు బోర్డు కార్యాలయాన్ని కేంద్ర హెూం మంత్రి అమిత్ షా ఆదివారం అట్టహాసంగా ప్రారంభోత్సవం చేశారు. కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్, రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, ధనసరి అనసూయ సీతక్క, పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి, ఎమ్మెల్యేలు ధన్పాల్ సూర్యనారాయణ గుప్తా, డాక్టర్ ఆర్.భూపతి రెడ్డి, కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి, పసుపు బోర్డు వైస్ చైర్మన్ భవాని, ఇతర ఉన్నతాధికారులు, కార్పొరేషన్ల చైర్మన్లు బోర్డు కార్యాలయ ప్రారంభోత్సవ సంరంభంలో పాలుపంచుకున్నారు. ఈ సందర్భంగా బస్వా గార్డెన్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో కేంద్ర హెూం శాఖ మంత్రి అమిత్ షా మాట్లాడుతూ, పసుపు బోర్డు కార్యాలయానికి ప్రారంభోత్సవం చేసే అవకాశం దక్కడం తన అదృష్టంగా భావిస్తున్నానని హర్షం వెలిబుచ్చారు. ఆహార పదార్థాలలోనే కాకుండా, శుభ కార్యాలలో, ఔషధ తయారీలలో విరివిగా వినియోగించే పసుపు పంటను నిజామాబాద్ జిల్లా రైతాంగం అధికంగా సాగు చేస్తోందని, అందుకే ఈ ప్రాంత రైతుల ఆకాంక్షను గౌరవిస్తూ ప్రధాని మోదీ నిజామాబాద్ లో పసుపు బోర్డును నెలకొల్పారని అన్నారు. నిజానికి 2023 లోనే బోర్డు ఏర్పాటు ప్రక్రియ ప్రారంభం అయ్యిందని, ఈ ఏడాది ఆరంభంలో కేంద్రం పసుపు బోర్డు ప్రకటన చేసిందని, ఇప్పుడు బోర్డు కార్యాలయాన్ని కూడా ప్రారంభించిందని అమిత్ షా వెల్లడించారు. పసుపు సాగు ద్వారా యావత్ దేశంలోని ప్రజలందరికీ ఆరోగ్యాన్ని పంచుతూ, దేశ సమృద్ధికి పాటుపడుతున్న పసుపు రైతులకు అండగా నిలవాలని సంకల్పంతోనే కేంద్రం బోర్డును ఏర్పాటు చేసిందన్నారు. దేశంలోనే అత్యధికంగా నిజామాబాద్, నిర్మల్, జగిత్యాల్, కామారెడ్డి జిల్లాలలో పసుపు పంట సాగు చేస్తున్నారని అమిత్ షా గుర్తు చేశారు. అనేక దశాబ్దాలుగా ఈ పంట పండిస్తున్నప్పటికీ పసుపు రైతులకు జాతీయ అంతర్జాతీయ మార్కెట్ కు అనుగుణంగా లాభాలు సమకూరడం లేదని అన్నారు. ప్రస్తుతం బోర్డు ఏర్పాటు వల్ల పసుపు రైతులకు ఇప్పుడు అందుతున్న మద్దతు ధర కంటే రానున్న రెండు మూడు సంవత్సరాల కాలంలోనే క్వింటాలుకు అదనంగా కనీసం రూ. 7000 వరకు ఎక్కువ ధర లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. పసుపు బోర్డు ద్వారా రైతులకు నాణ్యమైన పంటను సాగు చేసేలా శిక్షణ కార్యక్రమాలను నిర్వహించడంతో పాటు మార్కెటింగ్, ఎగుమతులు, బ్రాండింగ్ వంటి వాటిని మెరుగుపరచడం జరుగుతుందని, దళారుల ప్రమేయం లేకుండా నేరుగా రైతులకు గిట్టుబాటు ధర లభిస్తుందని అన్నారు. 2030 వరకు అంతర్జాతీయ స్థాయిలో ఒక మిలియన్ డాలర్ల విలువ చేసే పసుపు ఉత్పత్తులను ఎగుమతి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని అమిత్ షా వెల్లడించారు. అంతర్జాతీయ ఎగుమతుల వృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం భారత్ కో-ఆపరేటివ్ ఎక్స్ పోర్ట్ లిమిటెడ్, ఆర్గానిక్ పంటను ప్రోత్సహించేందుకు భారత్ ఆర్గానిక్ కో-ఆపరేటివ్ ఎక్స్ పోర్ట్ లిమిటెడ్ సంస్థలను నెలకొల్పిందని గుర్తు చేశారు. ఈ ప్రాంత పసుపు రైతులకు మరింత మేలు చేకూరేలా ఎక్స్ పోర్ట్ లిమిటెడ్ సంస్థల శాఖలను నిజామాబాద్ లో కూడా ఏర్పాటు చేస్తామని ప్రకటించారు.

**పసుపు రైతుల కల నెరవేర్చిన కేంద్రానికి ధన్యవాదాలు : మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**

తెలంగాణ ప్రాంత పసుపు రైతుల చిరకాల వాంఛను గుర్తించి పసుపు బోర్డును ఏర్పాటు చేసిన కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రాష్ట్ర ప్రభుత్వం తరపున ధన్యవాదాలు తెలిపారు. అత్యధిక విస్తీర్ణంలో పసుపు సాగు చేసే నిజామాబాద్ జిల్లాలో బోర్డును నెలకొల్పడం వల్ల ఈ ప్రాంత రైతుల పోరాటం ఫలించినట్లయ్యిందని అన్నారు. జాతీయ పసుపు బోర్డుతో నిజామాబాద్ జిల్లా ప్రతిష్ట మరింతగా ఇనుమడిస్తుందని, పసుపు రైతులకు ఇతోధికంగా మేలు జరుగుతుందని మంత్రి తుమ్మల ఆశాభావం వ్యక్తం చేశారు. జాతీయ బోర్డు ఏర్పాటు పసుపు పంట ఎగుమతులు, ఆధునాతన సాగు విధానాలు, యాంత్రీకరణ, సరికొత్త పరిశోధనలు, మెరుగైన మార్కెటింగ్ వంటి వసతులతో పసుపు రైతులకు ప్రయోజనం కలిగేలా కేంద్రం పూర్తిస్థాయిలో బోర్డు ద్వారా చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం కోరిన మేరకు తెలంగాణ రైతాంగానికి కావాల్సిన సహాయ సహకారాలను కేంద్రం అందిస్తోందని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం కూడా రైతుల సంక్షేమమే పరమావధిగా పాలన సాగిస్తోందని మంత్రి తుమ్మల స్పష్టం చేశారు. తీవ్ర ఆర్థిక ఇబ్బందులు నెలకొని ఉన్నప్పటికీ రైతాంగ ప్రయోజనాల కోసం ఏడాది కాలంలోనే తమ ప్రభుత్వం రూ. లక్ష కోట్ల వరకు వెచ్చించిందని వెల్లడించారు. అంతకుముందు జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి స్వాగతోపన్యాసం చేశారు. పసుపు బోర్డును ఏర్పాటు చేస్తూ, నిజామాబాద్ లో నెలకొల్పిన కేంద్ర ప్రభుత్వానికి, ప్రధాని నరేంద్ర మోడీకి పసుపు రైతుల పక్షాన ధన్యవాదాలు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, రైతులు పాల్గొన్నారు.

## డిఎస్ విగ్రహాన్ని ఆవిష్కరించిన అమిత్ షా..

**వేగుచుక్క న్యూస్:**



నగరంలోని కంఠేశ్వర్ బైపాస్ లో ఏర్పాటు చేసిన దివంగత మాజీ మంత్రి, సీనియర్ నేత ధర్మపురి శ్రీనివాస్ కాంస్య విగ్రహాన్ని కేంద్ర హెూం శాఖ మంత్రి అమిత్ షా ఆవిష్కరించారు. మాజీ మంత్రి డీఎస్ ప్రథమ వర్ధంతిని పురస్కరించుకున బైపాస్ రోడ్డులో ఆయన తనయుడు, ఎంపీ ధర్మపురి అరవింద్ రూ.44లక్షల వ్యయంతో 14అడుగుల కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయగా నిజామాబాద్ పర్యటనకు వచ్చిన కేంద్ర హెూం శాఖ మంత్రి అమిత్ షా చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ లతో ఎంపీ ధర్మపురి అరవింద్, ఎమ్మెల్యేలు ధన్ పాల్ సూర్యనారాయణ, పైడి రాకేశ్ రెడ్డి, జాతీయ పసుపు బోర్డు చైర్మన్ గంగారెడ్డి పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం.



**వేగుచుక్క న్యూస్, దోమకొండ, జూన్ 29:**



జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల 1984-85 పదవ తరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. అప్పటి ఉపాధ్యాయులను పిలుచుకొని కొత్తబట్టలు శాలువాలు పూలమాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రిటైర్డ్ డిఇఓ జలపతి రావు, రిటైర్డ్ డైట్ లెక్చరర్ మహేష్ బాబు, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు హన్మంతరావు, ఉపాధ్యాయులు రాజలింగం, నారాయణ లను పూర్వ విద్యార్థులు సన్మానించారు. ఈ కార్యక్రమానికి పన్యాల బాపురెడ్డి అధ్యక్షత వహించగా వ్యాఖ్యాత గా శేట్పల్లి శ్రీనివాసులు శర్మ నిర్వహించారు. పూర్వ విద్యార్థులు మద్దూరి బాపిరెడ్డి, శ్రీనివాస రావు, రామిరెడ్డి, రాజేందర్, సత్తూరి నర్సింలు, సత్యనారాయణ రావు, మోహన్ రెడ్డి, గదారి సంజీవ్ రెడ్డి, సాయిలు, రాధ కృష్ణ రెడ్డి, వంచ శ్రీనివాస్ రెడ్డి భూపాల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాకు ఘన స్వాగతం.






**వేగుచుక్క న్యూస్,నిజామాబాద్, జూన్ 29 :**


నిజామాబాద్ నగర పర్యటనకు విచ్చేసిన కేంద్ర హెూం శాఖ మంత్రి అమిత్ షాకు ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. ప్రత్యేక హెలికాప్టర్ ద్వారా కేంద్ర హెూం మంత్రి మధ్యాహ్నం 2.15 గంటలకు నిజామాబాద్ సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (న్యూ కలెక్టరేట్)కు చేరుకున్నారు. హెలిప్యాడ్ వద్ద ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు అమిత్ షాకు బొకేలు అంధించి స్వాగతం పలికారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అమిత్ షా వెంట హెలికాప్టర్ లో నిజామాబాద్ కు విచ్చేయగా, కేంద్ర మంత్రి బండి సంజయ్, ఎంపీ అరవింద్, అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ, పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి, బీజేపీ జాతీయ నాయకులు కే.లక్ష్మణ్, కలెక్టర్ టి.




వినయ్ కృష్ణారెడ్డి, పోలీస్ కమిషనర్ సాయి చైతన్య తదితరులు అమిత్ షాకు సాదర స్వాగతం పలికారు. కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల నడుమ ప్రత్యేక కాన్వాయ్ లో కేంద్ర హెూం మంత్రి వినాయక నగర్ చేరుకుని నూతనంగా నెలకొల్పిన జాతీయ పసుపు బోర్డు కార్యాలయాన్ని అట్టహాసంగా ప్రారంభోత్సవం చేశారు. అక్కడి నుండి కాన్వాయ్ ద్వారా బస్వా గార్డెన్ చేరుకుని, పసుపు బోర్డు ప్రారంభోత్సవ సమావేశంలో పాల్గొని పసుపు రైతులు, బోర్డు అధికారులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇంచార్జి మంత్రి ధనసరి అనసూయ, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి, రాష్ట్ర విత్తన అభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి, సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి, అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, పసుపు బోర్డు అధికారులు, రైతులు పాల్గొన్నారు.కేంద్ర హెూం శాఖ మంత్రి అమిత్ షా అధికారికంగా పాల్గొన్న కార్యక్రమాలకు ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా జిల్లా యంత్రాంగం విస్తృత స్థాయిలో ఏర్పాట్లు చేసింది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా పోలీస్ కమిషనర్ సాయి చైతన్య పర్యవేక్షణలో పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు.

## స్వేచ్ఛకు మృత్యువు సంకెళ్ళా!?

- మిత్ర




**పల్లవి:**

స్వేచ్ఛా నీకెందుకీ
మరణపు సంకెళ్ళు.
స్వేచ్ఛా నీ మెడకు బిగిసె
ఎవ్వరివీ ఉరితాళ్ళు.
ప్రగతిని కాంక్షించే
జంటకు
ప్రేమగ జన్మించావు.
గోడలు లేనింటా పెరిగి
స్వేచ్ఛగా విహరించావు.
పలు చూపులనెరిగిన
జర్నలిజానికి,
బహురూపాలున్న ఈ లోకానికి నీ వీపును ఎందుకు
చూపించావు.
ఏ మృత్యువుకెందుకు బలైనావు.

**అనుపల్లవి:**

స్వేచ్ఛా నువు ప్రశ్నవు కాదు. జవాబువే తల్లీ.. స్వేచ్ఛా నువు బిక్షవు
కాదు
శాసనంగా రా మళ్లీ.

,,స్వేచ్ఛా,,

1) స్వేచ్ఛా నీకై తపిస్తూ ఈ ప్రపంచమే ఉంది. స్వేచ్ఛను
సాధించడానికి
పోరాడుతా ఉంది.
నువ్ ఆడబిడ్డవయ్యి
సర్వనామం కాలేవా
నువ్ ఈడ బిడ్డవయ్యి
కల్సి జీవించలేవా
స్వేచ్ఛా సమానత్వం లేకే కులవర్గ సమాజం చీకటిచీల్చా
కలగందా స్వేచ్ఛా సమీరం.

,,స్వేచ్ఛా,,

2) సుడులై తిరిగిన నీ మనసులో ముడి వీడని ప్రశ్నేంటీ.
కల్లోలాలే జయించనింట్లో
కష్టము నీకేంటి.
నిను చుట్టుముట్టినా మగరాజ్యం
నట్టేట ముంచిన పితృస్వామ్యం
అందాలంటూ తిరిగింది
కాళ్ళకు బందాలేసింది.
తెల్సుకదా ఈ ప్రపంచమంతా వంచనతో ఉంది. చచ్చి కాదు
దాన్నే చంపేస్తేనే స్వేచ్ఛగా బతికేది.
స్వేచ్ఛా మగ ఆయుధం
ఉరితాడయి బిగిసిందా
తెగిపడినా సంకెళ్ళతో
ఎదిరించగా రావమ్మా
(కామ్రేడ్స్ శంకరన్న- శ్రీదేవిల కూతురు స్వేచ్ఛ బలవన్మరణం
హత్య లాంటిదని ఘోషిస్తూ, పితృస్వామ్యం లేని స్వేచ్ఛా
సమానత్వాలకై తపిస్తూ.... స్వేచ్ఛ అంతిమయాత్రలో
పాల్గొన్న సందర్భంగా)

# సేవా కార్యక్రమాలను మరింత విస్తరించాలి.

### లయన్స్ జిల్లా పూర్వ గవర్నర్ ఎస్.ఎస్ శ్యాంకుమార్.

### ఏడు లయన్స్ క్లబ్ ల నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం.

**వేగుచుక్క న్యూస్,**



లయన్స్ క్లబ్బుల సభ్యులు క్లబ్బుల ద్వారా నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలను మరింత విస్తరించాలని లయన్స్ జిల్లా పూర్వ గవర్నర్ ఎస్.ఎస్ శ్యాంకుమార్ ఉద్బోధించారు. లయన్స్ క్లబ్బులు ప్రపంచ వ్యాప్తంగా నిస్వార్థంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ అత్యుత్తమ స్వచ్ఛంద సంస్థగా గుర్తింపు కలిగి ఉన్నాయని ఆయన గుర్తు చేశారు.డిచ్పల్లి మండలం బర్దిపూర్ శివారులోని ఈవీఎం గార్డెన్స్ లో ఏడు లయన్స్ క్లబ్ ల నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం ఆదివారం అట్టహాసంగా జరిగింది. లయన్స్ క్లబ్ ఆఫ్ నిజామాబాదు, ఫోర్ట్ సిటీ, ఇందూర్, నందిపేట్, సహార, తెలంగాణ, సెంట్రల్ ల నూతన కార్యవర్గాలచే లయన్స్ పూర్వ గవర్నర్ ఎస్.ఎస్. శ్యాంకుమార్ ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, లయనిజంలోకి నూతనసభ్యులను చేర్పించి లయన్స్ సేవలను మరింత విసృతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ జిల్లా మొదటి ఉప గవర్నర్ విజయలక్ష్మి, రెండవ ఉప గవర్నర్ నర్సింహరాజు, పూర్వ గవర్నర్లు జి.శ్రీనివాస్, ఈ.వీరేశం, డి.పెంటయ్య, జిల్లా కార్యదర్శి ఎల్. శ్రీనివాస్ రెడ్డి, జిల్లా అదనపు కార్యదర్శి పి.లక్ష్మినారాయణ, ప్రోగ్రామ్ చైర్మెన్ కరిపె రవీందర్, కో చైర్మెన్ వేములపాటి రవీంద్ర, రీజియన్ చైర్మెన్ ఉదయ సూర్యభగవాన్, రీజియన్ కోఆర్డినేటర్ నాగేశ్వరరావు, జోన్ చైర్మెన్లు అవన్ కుమార్, నర్సింహరావు, భూమన్న, డి.యాదగిరి తదితరులు పాల్గొన్నారు.



## పూర్తిస్థాయి దర్శకత్వం వహించలే..




'సితారే జమీన్ పర్' అంటూ ప్రేక్షకుల ముందుకువచ్చి మనసులను కదిలించారు బాలీవుడ్ అగ్ర కథానాయకుడు ఆమిర్ ఖాన్. విమర్శకుల ప్రశంసలు అందుకుంటోన్న ఈ సినిమా విజయం తర్వాత ఆయన ఓ ఇంటర్వ్యూలో పాల్గొని తనకు నటన అంటే ఎంతో ఇష్టమని తెలిపారు. అలాగే దర్శకత్వం వైపు వెళ్లకపోవడానికి గల కారణాన్ని వివరించారు. ఆమిర్‌ఖాన్ దర్శకత్వం వహించిన ఏకైక సినిమా 'తారే జమీన్ పర్'. హిట్ టాక్‌ను సొంతం చేసుకొని ఆయనకు పేరు తెచ్చిన ఆ సినిమా తర్వాత ఆయన దర్శకత్వం వహించలేదు. తాజాగా ఈ విషయంపై మాట్లాడుతూ.. 'పూర్తిగా దర్శకుడిగా మారకపోవడానికి ఏకైక కారణం నటనపై నాకున్న ఇష్టమే. ఈ పరిశ్రమలో దర్శకత్వం, నిర్మాణం రెండూ చాలా ఆసక్తికరంగా ఉంటాయి. ఒకవేళ నేను దర్శకత్వం వైపు వెళ్తే నటన బోరింగ్‌గా అనిపిస్తుంది. బోర్ కొట్టిన పనిని నేను చేయలేను. కాబట్టి నటన మానేస్తాను.

## తమ్ముడు చిత్రానికి ఎ సర్టిఫికెట్




టాలీవుడ్ నటుడు నితిన్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం తమ్ముడు వకీల్ సాబ్ ఫేమ్ వేణు శ్రీరామ్ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తుండగా.. కన్నడ నటి సప్తమి గౌడ కథానాయికగా నటిస్తుంది. ఈ చిత్రాన్ని జూలై 4న విడుదల చేయనున్నట్లు చిత్రయూనిట్ ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా వరుస ప్రమోషన్స్‌లో పాల్గొంటున్నారు మేకర్స్. ఇప్పటికే ట్రైలర్‌ను విడుదల చేయగా.. ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఇదిలావుంటే తాజాగా ఈ సినిమా సెన్సార్ కంప్లీట్ చేసుకుంది. సెన్సార్ బోర్డు ఈ సినిమాకు ఏ సర్టిఫికెట్‌ను అందించింది. ఈ విషయాన్ని చిత్రయూనిట్ సోషల్ మీడియా వేదికగా పంచుకుంది. ఈ సినిమాలో లయ, స్వశిక, వర్ష బొల్లమ్మ, సౌరభ్ సచ్‌దేవా కీలక పాత్రల్లో కనిపించనున్నారు. శ్రీ వెంకటేశ్వర బ్యానర్‌పై దిల్ రాజు నిర్మించిన ఈ చిత్రానికి అజనీష్ లోక్‌నాథ్ సంగీతం అందించారు.





## హిట్ టాక్‌లో కన్నప్ప మూవీ

మంచు విష్ణు హీరోగా నటించిన కన్నప్ప సినిమా ఎట్టకేలకు నిన్న ప్రేక్షకుల ముందుకు వచ్చేసింది. కొన్నిసార్లు వాయిదా పడిన ఈ సినిమా శుక్రవారం ప్రేక్షకుల ముందుకు వచ్చి మంచి పాజిటివ్ టాక్ సంపాదించింది. సినిమా బాలేదని అనే వాళ్లు ఉన్నా సరే, ఎక్కువ శాతం మాత్రం సినిమా బాగుందని అంటున్నారు. అయితే ఈ సినిమా టీం మాత్రం ఒక ఆసక్తికరమైన పోస్టర్ రిలీజ్ చేయడం చర్చకు తావిస్తోంది. నిజానికి ఈ సినిమా ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది. ప్రేక్షకులు కూడా థియేటర్లకు వెళ్లి చూడాలనుకుంటున్నారు. చాలామంది చూస్తున్నారు. అయితే ఏకంగా మొదటి రోజే ఇండస్ట్రీ హిట్ కన్నప్ప అంటూ పోస్టర్ రిలీజ్ చేయడంతో ఒక్క రోజులోనే ఇండస్ట్రీ హిట్ స్టేటస్ సాధించిన ఘనత ఈ సినిమాకే దక్కుతుంది అంటూ సోషల్ మీడియాలో కొందరు ట్రోల్ చేస్తున్నారు. ఇండస్ట్రీలో అప్పటివరకు ఉన్న హిట్ సినిమా రికార్డులను ఈ సినిమా తిరగరాసి అత్యధిక కలెక్షన్లు రాబడితే దాన్ని ఇండస్ట్రీ హిట్ అని అభివర్ణిస్తారు. కానీ మంచు విష్ణు సినిమా టీం ఏమని ఆలోచించిందో తెలియదు, కానీ ఏకంగా రెండవ రోజు ఇలా రికార్డు స్థాయిలో ఇండస్ట్రీ హిట్ పోస్టర్ రిలీజ్ చేయడం చర్చకు తావిస్తోంది.

## విజ్జూ..నిన్ను గర్వపడేలా చేస్తా






మైసాపై నటి రష్మిక ఆసక్తిక పోస్ట్ విజయ్ దేవరకొండతో రష్మిక డేటింగ్ అంటూ కొన్నేళ్లుగా రూమర్లు వస్తున్నా వీరు మాత్రం స్పందించ ట్లేదు. ఎప్పటికప్పుడు అడ్డంగా దొరికిపోతూనే ఉన్నారు. తాజాగా రష్మిక చేసిన పోస్టు వీరిద్దరి డేటింగ్ ను కన్ఫర్మ్ చేసేలా ఉంది. రష్మిక తన మైసా సినిమాను అనౌన్స్ చేసిన విషయం తెలిసిందే. ఈ మూవీకి స్టార్ హీరోలు విషెస్ చెబుతున్నారు. తాజాగా విజయ్ దేవరకొండ కూడా ఆమెకు కంగ్రాట్స్ చెబుతూ విషెస్ చెప్పారు. ఇది అద్భుతంగా ఉంటుంది అని ఇన్ స్టా స్టోరీలో పోస్ట్ చేశాడు. దానికి రష్మిక విజయ్ దేవరకొండను ఉద్దేశిస్తూ రిప్లై ఇచ్చింది. 'విజ్జూ ఈ సినిమాతో నిన్ను గర్వపడేలా చేస్తానని మాటిస్తున్నా' అంటూ లవ్ ఎమోజీతో రిప్లై ఇచ్చింది. ఆమే చేసిన ఈ పోస్టు కాస్త వైరల్ అవుతోంది. విజయ్ దేవరకొండను విజ్జూ అంటూ పిలవడం అందరికీ ఆశ్చర్యంగా అనిపిస్తోంది. ఆమె పోస్టు చూసిన వారందరికీ.. ఆమె విజయ్ ను లవ్ చేస్తోందని కన్ఫర్మ్ చేసినట్టే అంటున్నారు. విజయ్ గర్వపడేలా చేయాల్సిన అవసరం ఆమెకు ఏముంది. వీరిద్దరి మధ్య ఏదో ఉంటేనే కదా ఇలాంటి రిప్లై ఇస్తుంది అని అంటున్నారు. ఏదేమైనా రష్మిక, విజయ్ తమ రిలేషన్ ను ప్రకటించకుండా.. చేయాల్సినవన్నీ చేసేస్తున్నారు. ప్రస్తుతం రష్మిక వరుస సినిమాలతో బిజీగా ఉంది. ఇలాంటి టైమ్ లో లేడీ ఓరియెంటెడ్ సినిమాను చేయడం అందరికీ ఆశ్చర్యంగా అనిపిస్తోంది. ఈ సినిమాలో వయోలెంటిక్ పాత్రలో రష్మిక నటిస్తున్నట్టు తెలుస్తోంది.




## హరిహరవీరమల్లు ఆలస్యం.. అభిమానుల్లో అసహనం

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా, నిధి అగర్వాల్ హీరోయిన్‌గా, క్రిష్ జాగర్లమూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న భారీ పాన్ ఇండియా చిత్రం 'హరిహర వీరమల్లు'. ఈ చిత్రం పై అభిమానులు ఏ స్థాయిలో ఆశలు పెట్టుకున్నారో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. కానీ ఆ అంచనాలకు మేకర్స్ అనుగుణంగా స్పందించకపోవడంపై అభిమానుల్లో అసంతృప్తి పెరిగిపోతోంది. ఇప్పటికే చాలా కాలం క్రితమే షూటింగ్ పూర్తి అయినప్పటికీ, చిత్ర బృందం నుంచి సరైన అప్డేట్స్ లేకపోవడం అభిమానులకు తీవ్ర నిరాశ కలిగిస్తోంది. ముఖ్యంగా, ఈ వారం ట్రైలర్‌కు సంబంధించి అప్డేట్ వస్తుందని ప్రకటించినప్పటికీ, అది ఇప్పటివరకు విడుదల కాలేదు. వారం ముగియబోతున్నా కూడా కనీసం ఒక టీజర్, పోస్టర్, గ్లింప్స్ లాంటి ఏదైనా చిన్న హింట్ ఇవ్వకుండా, పూర్తిగా నిశ్శబ్దంగా ఉండిపోవడం వలన ఫ్యాన్స్ నిరాశకు లోనవుతు న్నారు. దీంతో చిత్రబృందం సోషల్ మీడియా వేదికగా కూడా ప్రమోషన్ పరంగా ఏమీ చేయకపోవడాన్ని అభిమానులు తీవ్రంగా విమర్శిస్తున్నారు. సినిమా రిలీజ్‌ను మళ్లీ మళ్లీ వాయిదా వేయడమే కాదు, ఇప్పుడు ట్రైలర్ అప్డేట్స్ విషయంలో కూడా అజాగ్రత్తగా వ్యవహరించడం అభిమానులకు నిజమైన 'వర్స్ట్ ఎక్స్‌పీరియన్స్'గా మారుతోంది. ఇప్పటికే సినిమా ఎన్నోసారి వాయిదా పడింది. పవన్ కళ్యాణ్ షూటింగ్ పూర్తి చేసినప్పటికీ సినిమా విడుదలపై ఇప్పటికీ స్పష్టత లేకపోవడం, దానికి తోడు తాజా ట్రైలర్ అప్డేట్ విషయంలోనూ స్పష్టత లేకుండా మేకర్స్ వ్యవహరించడం వల్ల ఫ్యాన్స్ ఆగ్రహంగా ఉన్నారు. మొత్తంగా చూస్తే, 'హరిహర వీరమల్లు'పై ఉన్న హైప్‌ను సద్వినియోగం చేసుకోవడంలో చిత్రబృందం పూర్తిగా విఫలమైందని చెప్పాలి. ఎంత భారీ బ్జడెట్, స్టార్ కాస్ట్ ఉన్నా.. ఇలా అప్డేట్‌లు లేకుండా డిజప్పాయింట్ చేయడం అభిమానులకు నిజంగా బాధ కలిగించే విషయం.



## డిమాండ్ పెంచేసిన శ్రీలీల

పెళ్లి సందడిసినిమాతో తెలుగు సినీ పరిశ్రమకు పరిచయమైన శ్రీలీల ఆ తర్వాత మళ్లీ వెనక్కి తిరిగి చూసుకోవలసిన అవసరం పడలేదు. ఎందుకంటే ఆమెకు వరుస సినీ అవకాశాలు అలా వచ్చి పడ్డాయి. నిజానికి ఆమెకు ఎన్ని హిట్ సినిమాలు ఉన్నాయో అన్ని ఎ÷-లాప్ సినిమాలు కూడా ఉన్నాయి. కానీ ఆమె డిమాండ్ మాత్రం తగ్గడం లేదు, సరికదా ఎప్పటికప్పుడు పెరుగుతోంది. ఇప్పటికే ఆమె రెమ్యూనరేషన్ చాలాసార్లు పెంచింది. తాజాగా బాలీవుడ్ ఆఫర్లు వస్తున్నందున ఆమె ఇప్పుడు మరోసారి రెమ్యూనరేషన్ పెంచినట్లు తెలుస్తోంది. తాజా సమాచారం మేరకు శ్రీలీల ఏకంగా ఏడు కోట్లు డిమాండ్ చేస్తున్నట్లు తెలుస్తోంది. తెలుగు సినిమా హీరోయిన్‌కి రెమ్యూనరేషన్ అంటే చాలా పెద్ద అమౌంట్ అని చెప్పాలి. అయితే బాలీవుడ్ నిర్మాతలు శ్రీలీలకు ఆ మొత్తం ఇవ్వడానికి ఏమాత్రం వెనకాడడం లేదని అంటున్నారు. ఈ నేపథ్యంలో ఆమె రెమ్యూనరేషన్ భారీగా పెంచింది. అయితే ఆమెకు 7 కోట్లు ఇవ్వడానికి తెలుగు నిర్మాతలు ప్రస్తుతానికి సిద్ధంగా లేరు. అందుతున్న సమాచారం మేరకు ఆమె ఇప్పటివరకు రెండున్నర కోట్లు ఒక్కో తెలుగు సినిమాకి తీసుకునేది. పుష్ప సినిమాలో ఐటమ్ సాంగ్ కోసం మూడు కోట్లు తీసుకుంది. ఇప్పుడు బాలీవుడ్‌లో అవకాశాలు రావడం మొదలుపెట్టాయి కదా అని, డబ్బులు డిమాండ్ చేసి ఏకంగా ఏడు కోట్లు అడుగుతున్నట్లు తెలుస్తోంది. ఒకవిధంగా అఖిల్ అక్కినేని లెనిన్ సినిమా నుంచి బయటకు వెళ్లిపోవడానికి కూడా ప్రధాన కారణం ఇదే అని అంటున్నారు.